క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శంకర్‌పల్లి: పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం శంకర్‌పల్లి పట్టణం, సింగాపూర్, డబుల్ బెడ్రూం, కొండకల్, ఫత్తేపూర్, శేరిగూడ గ్రామాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ప్రదీప్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఇంజనీర్స్ డే



ఇంజనీర్‌ను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

షాద్‌నగర్: పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ కల్యాణ మండపంలో వాసవి క్లబ్, వనితా క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఇంజనీర్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఇంజనీర్లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ దొంతు పాండురంగయ్య, క్లబ్ అధ్యక్షుడు కల్వ మాణిక్యం, కల్వ మధుప్రియ, సురేశ్‌కుమార్, వెంకటరమణ, సత్యనారాయణ, ఎంసాని శ్రీనివాస్, పెద్ది రామ్మోహన్, ఆనంద్, శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

లయన్స్ క్లబ్ సభ్యుడు విజయ్‌కుమార్

షాబాద్: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మండల బాలుర ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులదేనన్నారు. అజ్ఞాన అంధకారాన్ని పారద్రోలి, జ్ఞాన జ్యోతిని వెలిగించేవారు ఉపాధ్యాయులేనన్నారు. కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కొందుర్గు: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాల్లో సోమవారం మండల ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో ఎంఈఓలు గాయత్రీదేవి, కిరణ్‌కుమార్ పాల్గొని వారిని శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. విద్యార్థులను నాణ్యమైన బోధన అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని కలిసిన నాయకులు



వీరేందర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

కేశంపేట: బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన తూళ్ల వీరేందర్‌గౌడ్‌ను సోమవారం మండల నాయకులు సోమవారం కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయానికి వెళ్లిన వారు ఆయనను కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పసుల నర్సింహాయాదవ్, మహేశ్, కర్రెల్ల నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

టీబీ నివారణలో నిర్లక్ష్యం చేయొద్దు

పీహెచ్‌సీ వైద్యురాలు దీప్తి

కొత్తూరు: టీబీ(క్షయ) వ్యాధికి గురైన బాధితులు వైద్యుల సలహాలు, సూచనలతో క్రమం తప్పకుండా చికిత్సలు చేయించుకుంటే వ్యాధి తగ్గుతుందని పీహెచ్‌సీ వైద్యురాలు స్ఫూర్తి సూచించారు. ఇందులో భాగంగా పట్టణంలో సోమవారం నిర్వహించిన టీబీ నిర్మూలన శిబిరంలో ఆమె పాల్గొన్నారు. అంతకుముందు స్థానిక నాయకులు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్యురాలు మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా దగ్గు, ఇతర లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రస్తుతం టీబీ నిర్మూలనకు ప్రభుత్వం అన్ని రకాల మందులను అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. శిబిరంలో భాగంగా లక్షణాలు ఉన్న పలువురిని పరీక్షల నిమిత్తం షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రవీందర్, సీహెచ్‌ఓ నగేశ్ పాల్గొన్నారు.

కొత్తూరులో కార్యాలయాలు



నందిగామ మండల పరిధిలో ఉన్న కొత్తూరు పీహెచ్‌సీ

- స్థానికంగానే పీహెచ్‌సీ, పీఏసీఎస్
- ఇప్పటివరకు నందిగామ మండలంలోనే కొనసాగింపు
- ఎమ్మెల్యే చొరవతో ఏర్పాటుకు చర్యలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



నందిగామలో కొనసాగుతున్న పీఏసీఎస్ కేంద్రం

కొత్తూరు: మండలంలో కొనసాగుతున్న పీహెచ్‌సీ, పీఏసీఎస్ కేంద్రాలు స్థానిక ఎమ్మెల్యే చొరవతో కొత్తూరు మండలంలో ఏర్పాటు కానున్నాయి. గతంలో ప్రభుత్వం మండలాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా అప్పటివరకు కొత్తూరులో కొనసాగిన మేజర్ గ్రామ పంచాయతీ నందిగామను మండలముగా ఏర్పాటు చేశారు. కాగా అప్పటికే నందిగామ మండల పరిధిలోనే పీహెచ్‌సీ, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు కొనసాగుతున్నాయి. మండల విభజన తర్వాత కూడా అధికారులు కొత్తూరు మండలానికి ప్రభుత్వ ఆస్పత్రి, పీఏసీఎస్ కేంద్రాలను తరలించే ప్రక్రియను చేపట్టలేదు. దీంతో ఆయా పనుల నిమిత్తం అవసరం ఉంటే ప్రజలు, రైతులు కొత్తగా ఏర్పాటైన మండలానికే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

రెండు పీహెచ్‌సీలు నందిగామలోనే..

గతంలో కొత్తూరు మండలంలో పారిశ్రామికవాడ, జాతీయ రహదారి ఉండడంతో ఆయా ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణమే చికిత్స అందించాలనే ఉద్దేశంతో కొత్తూరు, నందిగామలో రెండు పీహెచ్‌సీలను ఏర్పాటు చేశారు. కాగా మండలాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా రెండు పీహెచ్‌సీలు నందిగామ మండల పరిధిలోకే వెళ్లాయి.

త్వరలో ఏర్పాటుకు కృషి



మండలాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా నందిగామ కొత్త మండలముగా ఏర్పడింది. అప్పటివరకు ఆ మండల పరిధిలోనే కొత్తూరు మండలానికి సంబంధించిన ప్రభుత్వ ఆస్పత్రి, పీఏసీఎస్ కేంద్రాలు ఉన్నాయి. తర్వాత కొత్తూరులోకి మార్చడానికి అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. సాధ్యమైనంత త్వరలో కార్యాలయాలను కొత్తూరులో ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నా.

–వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే

ప్రస్తుతానికి నందిగామ మండలం రంగాపూర్‌లో ఉన్న పీహెచ్‌సీకే కొత్తూరు మండలానికి చెందిన రోగులు వెళ్తున్నారు. కొత్తూరు మండలంలో 32వేలకుపైగా జనాభా ఉన్నట్లు అధికారుల లెక్కలు తెలుపుతున్నాయి.

మూడు పీఏసీఎస్‌లు పక్క మండలంలోనే..

ప్రస్తుతం నందిగామ మండలంలోని మేకగూడ, చేగూరు, నందిగామ మండల కేంద్రాల్లో మూడు (పీఏసీఎస్)లు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు కొనసాగుతున్నాయి. కొత్తూరు మండలంలో మాత్రం ఒక్క సంఘం కూడా లేదు. మండలాలు వేరుపడి ఎనిమిదేళ్లు గడుస్తున్నా రైతులు సేవలు మాత్రం పాత కార్యాలయాల నుంచే పొందుతున్నారు. దీంతో ఆయా సేవల కోసం పక్క మండలానికి వెళ్తున్న ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మండలాలు వేరు పడిన కార్యాలయాలను మార్చడం లేదంటూ చర్చించుకుంటున్నారు.

ఆకట్టుకున్న టీఎల్‌ఎం మేళాలు



కొందుర్గు: మేళాలో ప్రదర్శనలను వివరిస్తున్న ఉపాధ్యాయులు

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాల్లో సోమవారం టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు గాయత్రి, కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయా మండలాల్లోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులో బోధన ఉపకరణములను సిద్ధం చేసి మేళాలలో ప్రదర్శించారు. గణితం, భౌతిక, రసాయన శాస్త్రాలను విద్యార్థులకు సునాయసంగా ఎలా బోధించాలో వారి, వారి ప్రదర్శనల ద్వారా వివరించారు. తెలుగు, ఆంగ్లం పదాలు, వాక్యాల నిర్మాణం, భాషాభాగాలు, పద్యాలు, కవితలను విద్యార్థులకు అర్థవంతంగా వివరించేందుకు ప్రదర్శనలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి, రాజు పాల్గొన్నారు.



షాబాద్: టీఎల్‌ఎం మేళాలో విజేతలతో ఎంపీడీఓ అపర్ణ, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

సృజనాత్మకత పెంపునకు దోహదం

షాబాద్: విద్యాబోధనలో సృజనాత్మకతను పెంపొందించేందుకు టీఎల్‌ఎం మేళా ఎంతో దోహదపడుతుందని ఎంపీడీఓ అపర్ణ, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండలస్థాయి టీఎల్‌ఎం మేళా-2025 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ ఉత్తమ టీఎల్‌ఎంలను రూపొందించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు డేవిడ్‌రెడ్డి, కృష్ణ, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

చేవెళ్ల: మండల అభివృద్ధిలో భాగంగా ఆయా గ్రామాలకు వచ్చిన హెచ్‌ఎండీఏ నిధులతో చేపట్టనున్న పనులకు ఎమ్మెల్యే కాలె యాదయ్య మంగళవారం శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. మండలంలోని లక్ష్మీగూడ, గుండాల, సాయిరెడ్డిగూడ, అల్లవాడ, చనువెల్లి, గొల్లపల్లి, ధర్మసాగర్, రావులపల్లి, ముడిమ్యాల గ్రామాల్లో సీసీరోడ్లు, వీధిలైట్ల ఏర్పాట్లకు శంకుస్థాపనలు చేయనున్నట్లు వెల్లడించారు. ఆయా కార్యక్రమాలకు మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

పేదల ఆరోగ్య సంరక్షణకు చర్యలు



ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: నిరుపేదల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో పేదలను ఆదుకునేందుకు శంషాబాద్ లిమ్స్ ఆస్పత్రి వారు షాద్‌నగర్ నియోజకవర్గంలో నాలుగు అంబులెన్స్‌లతో ఉచిత సేవలు అందించనున్నట్లు తెలిపారు. కేశంపేట, ఫరూఖ్‌నగర్ మండలాలతో పాటు ఉమ్మడి మండలాలైన కొత్తూరు, నందిగామ, కొందుర్గు, చౌదరిగూడ మండలాలకు ఒక్కొక్కటి సుమారు రూ.15లక్షలతో నాలుగు అంబులెన్స్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అంబులెన్స్‌లో వైద్య సిబ్బంది, డ్రైవర్, ఆక్సిజన్, వెంటిలేటర్ వంటి అత్యాధునిక సదుపాయాలను ఆస్పత్రి వారే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అత్యవసర సమయాల్లో గ్రామీణ ప్రాంతాల ప్రజలు సరైన సమయానికి ఆస్పత్రికి వెళ్లక ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో పేద ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి లిమ్స్ ఆస్పత్రి వారు ఉచిత అంబులెన్స్ సేవలను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. అదేవిధంగా ప్రభుత్వం విద్య, వైద్య రంగానికి పెద్దపీట వేసిందన్నారు. నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ సందర్భంగా అంబులెన్స్ సేవలకు సంబంధించిన ఫ్లెక్సీని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి, ఆస్పత్రి సూపరింటెండెంట్ విష్ణువర్ధన్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, నాయకులు బాబర్‌ఖాన్, రఘునాయక్, బాల్‌రాజ్, బస్వం, రవికుమార్, ముబారక్, ఖాదీర్, సత్తయ్య, అశోక్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

నందిగామ: ఆలయాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన నందిగామ శివారులోని పారిశ్రామిక వాడలో నిర్మించిన అయ్యప్పస్వామి దేవాలయంలో గ్రానైట్ పనుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొన్నేళ్ల క్రితం సతీషన్‌నాయర్ గురుస్వామి ఆధ్వర్యంలో ఇక్కడ అయ్యప్ప దేవాలయం నిర్మించారన్నారు. అప్పుడే మాలధారణ ప్రారంభమైందని, ఒక్కొక్కరుగా ప్రస్తుతం వేలాది మంది అయ్యప్పలు మాలధారణ చేస్తున్నారని గుర్తుచేశారు. గతంలో నిర్మించిన దేవాలయం పూరతనమైనది కావడంతో అయ్యప్ప భక్త కమిటీ ఏర్పాటు చేసి.. దాతల సహాయంతో పునర్నిర్మాణం చేయడం అభినందనీయమన్నారు. దేవాయలాన్ని అద్భుతంగా నిర్మిస్తున్నారని, ఇంకా ఏమైనా అవసరమైతే తనవంతు సహకారాలు అందిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో గురుస్వామి గిరిషన్ నాయర్, అయ్యప్ప భక్తులు బాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, సుదర్శన్ గౌడ్, లక్ష్మయ్య, దార లింగం, తుమ్మల నర్సింహాయాదవ్, తుమ్మల జగన్, కావలి కృష్ణ, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, జంగ నర్సింహ, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, కుమార్‌గౌడ్, రాజ్‌గోపాల్, శ్రీకాంత్‌రెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

షాబాద్: మండల కేంద్రంలోని శ్రీరామకాలనీలో పారిశుద్ధ్యం లోపించిందని, తాగడానికి నీరు కూడా రావడం లేదని కాలనీవాసులు ఆరోపించారు. సోమవారం ఎంపీడీఓ అపర్ణకు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మా కాలనీ పక్కన కుళ్లిన మాంసం, కోళబరాలు, చెత్త తీసుకొచ్చి వేస్తున్నారని తెలిపారు. కొందరు పందులను పెంచుతున్నారని, దీంతో ఈగలు, దోమలతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వాపోయారు. అలాగే తాగడానికి నీరు కూడా సరిగా రావడం లేదన్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

పృథ్వీకాలనీలో జోరుగా పారిశుద్ధ్య పనులు

సాక్షి ఎఫెక్ట్..

నందిగామ: మండల పరిధిలోని అంతిరెడ్డిగూడ గ్రామ పంచాయతీ పృథ్వీకాలనీలో పారిశుద్ధ్యం లోపించడంలో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనే విషయమై సాక్షిలో ఆదివారం 'పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు సోమవారం స్పందించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మహేశ్ పారిశుద్ధ్య కార్మికులతో కాలనీలో పారిశుద్ధ్య పనులు చేయించారు. కాలనీలో పేరుకుపోయినా చెత్తాచెదారాలను తొలగించారు. మురుగు నీరు చేరిన చోట ఆయిల్ బాల్ స్ప్రే చేయించారు. జేసీబీ, దోజర్ల సహాయంతో కాలనీ పరిసరాలను శుభ్రం చేయించారు. ఎన్నో రోజుల పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను వెలుగులోకి తెచ్చి పరిష్కరించిన సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.



ఇళ్ల మధ్య పేరుకుపోయిన చెత్తను దోజర్ సహాయంతో తొలగింపు

క్రీడా ప్రాంగణాల్లో పిచ్చిమొక్కల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

నందిగామ: మండల పరిధిలోని గ్రామాల్లో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా ఉన్నాయని, నిర్వహణ లేక గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగి అడవులను తలపిస్తున్నాయనే విషయమై సాక్షిలో సోమవారం 'బోర్డులకే పరిమితం' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. ఈ మేరకు వెంకమ్మగూడలోని క్రీడా ప్రాంగణాన్ని కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో దోజర్ సహాయంతో చదును చేయించారు. మైదానంలో ఉన్న పిచ్చిమొక్కలు, గడ్డి తొలగించి యువకులు ఆడుకునేందుకు అనువుగా చేశారు.



వెంకమ్మగూడలో క్రీడా మైదానాన్ని దోజర్‌తో చదును చేయిస్తున్న కార్యదర్శి రామకృష్ణ

విధుల్లో చేరిన కొత్త జీపీఓలు

- కొందుర్గులో 9 క్లస్టర్లకు 9 మంది జీపీఓలు
- జిల్లేడ్ చౌదరిగూడకు 9 క్లస్టర్లకు ఇద్దరే

కొందుర్గు: కొందుర్గు మండలానికి కొత్త జీపీఓలు వచ్చారని డిప్యూటీ తహసీల్దార్ రాకేశ్ తెలిపారు. మండలంలోని 9 క్లస్టర్లకు గాను 9 మంది జీపీఓలు సోమవారం విధుల్లో చేరారు. అదేవిధంగా జిల్లేడ్ చౌదరిగూడ మండలానికి సంబంధించి ఇద్దరే విధుల్లో చేరినట్లు తహసీల్దార్ జగదీశ్వర్ తెలిపారు. కొందుర్గు తూర్పు కావలి హరీశ్, కొందుర్గు పడమర అలివేలు, ఉత్తరాసిపల్లి శ్రీకాంత్, చిన్నఎల్కిచర్ల శేఖర్, ముట్పూర్ కావలి నరేశ్, చెర్కుపల్లి బాలకృష్ణ, ఉమ్మెంత్యాల లాలపేట మహేందర్, తంగెళ్లపల్లి అబ్దుల్ అజీజ్, ఆగిర్యాల పద్మయ్య విధుల్లో చేరారు.



జీపీఓలను విధుల్లోకి ఆహ్వానిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ రాకేశ్

జిల్లేడ్ చౌదరిగూడలో..

జిల్లేడ్ చౌదరిగూడ 9 క్లస్టర్లకు గాను ఇద్దరే విధుల్లో చేరారు. పద్మారం శ్రీనయ్య, ఎదిర నర్సింహ విధుల్లో చేరినట్లు తహసీల్దార్ జగదీశ్వర్ తెలిపారు. మిగతా 7 క్లస్టర్లు రావిర్యాల, గుర్రంపల్లి, వనంపల్లి, జిల్లేడ్, పెద్దఎల్కిచర్ల, చేగిరెడ్డిఘనాపూర్, జాకారంకు సంబంధించి ఎవరూ రాలేదని స్పష్టం చేశారు.

పింఛన్లు పెంచేవరకు పోరాటం ఆగదు

- ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి శివశంకర్‌మాదిగ
- తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసనలు, వినతిపత్రాల అందజేత



చేవెళ్ల: తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చేవెళ్ల: పింఛన్లు పెంచేవరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం ఆగదని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి బి.శివశంకర్‌మాదిగ అన్నారు. సోమవారం మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పెన్షన్ల పెంపుపై తహసీల్దార్ కృష్ణయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నిలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పెన్షన్‌లను పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావొస్తున్నా నేటికీ వాటి పెంపుపై నోరు తెరవకపోవటం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే పింఛన్లు పెంచి అమలు చేయాలన్నారు. లేదంటే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెన్షన్‌దారుల పక్షాన నిలబడి పోరాటం ఉధృతం చేస్తామన్నారు. అక్టోబర్ 11న హైదరాబాద్‌లో చేయూత పెన్షన్‌దారుల మహాగర్జన సభ లక్షాలది మందితో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వెంటనే ముఖ్యమంత్రి స్పందించకపోతే రానున్న పరిణామాలకు ఆయన బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా పెన్షన్‌దారుల సత్తాను చూపిస్తారన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటేశ్, చందు, మల్లేశ్, రాములు, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

పెంచేవరకు ఉద్యమాన్ని విరమించం

శంకర్‌పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా రాష్ట్రంలో పెన్షన్లు పెంచాలని, అప్పటివరకు ఉద్యమాన్ని ఆపేది లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి యాదగిరి స్పష్టం చేశారు. సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేయగా.. జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌తో పాటు ఆయన ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీటిపై ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే, భవిష్యత్తులో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు లింగం, సాయి, లక్ష్మయ్య, జగదీశ్, యాదగిరి, శివ, సుజాత, లక్ష్మి, పద్మ, అబిబ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్: డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంఎస్పీ నాయకులు

పింఛన్‌దారులను మోసం చేసిన కాంగ్రెస్

షాబాద్: పింఛన్‌దారులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధి మల్కి ప్రవీణ్‌మాదిగ, మాజీ అధ్యక్షుడు ముక్కు విశ్వంమాదిగ అన్నారు. సోమవారం వారు ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచాలని కోరుతూ తహసీల్దార్ ఎండీ అన్వర్‌కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ సర్కారు మోసాలను ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెంటనే పింఛన్లు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, నర్సింలు, బాల్‌రాజ్, జంగయ్య, వెంకటయ్య, బాబు, రాజు తదితరులు ఉన్నారు.

పింఛన్లు పెంచాలి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు తక్షణమే ఫించన్లను పెంచాలని ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు మహేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని అమ్దాపూర్‌లో ఆయన ఆధ్వర్యంలో నాయకులు జెండా ఆవిష్కరించి, నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కోళ్ల శివకుమార్, గొల్ల సిద్ధయ్య, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, సాయికుమార్, వరుణ్‌కుమార్, తెలుగు సత్తయ్య, ఎం.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ర్యాలీ

నందిగామ: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు పెన్షన్లను పెంచాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి చెన్నగళ్ల శ్రావణ్‌మాదిగ ఆధ్వర్యంలో సోమవారం నాయకులు, పెన్షన్‌దారులు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి పెద్దఎత్తున ర్యాలీగా వెళ్లి తహసీల్దారు కార్యాలయం ఎదుట బైఠాయించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దారు సైదులుకు అందించారు. కార్యక్రమంలో నాయకులు జంగారి రమేశ్, కోరని మల్లమ్మ, పెన్షన్‌దారులు తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ప్రజలను మోసం చేసిన సర్కార్

కొత్తూరు: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పెన్షన్లు పెంచుతామని నమ్మించి మోసం చేశారని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శ్రీశైలం అన్నారు. సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రభుత్వం ఇచ్చిన హామి మేరకు పెన్షన్లు పెంచాలని కోరుతూ తహసీల్దార్ రవీందర్‌రెడ్డికి ఆయన నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శివశేఖర్, సువర్ణ, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

మొయినాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఎంఎస్పీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి క్యాసారం శంకర్‌రావు మాదిగా అన్నారు. ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులు, వృద్ధులు, వితంతువుల పింఛన్లను ప్రభుత్వం వెంటనే పెంచాలనే డిమాండ్‌తో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం మండల డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు రూ.6వేలు, చేయూత పెన్షన్ రూ.4వేలు ఇస్తామని చెప్పి మాట తప్పిందన్నారు. ఇచ్చిన హామీని వెంటనే అమలు చేస్తూ పింఛన్లు పెంచాలని.. అర్హులైనవారికి కొత్తవి మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహేందర్‌మాదిగ, నాయకులు ఉన్నారు.